

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,09,189లు, బంగారం 2 గ్రాముల 290 మిల్లీగ్రాములు, వెండి 23 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



రెండు క్వింటాళ్ల గంజాయి స్వాధీనం

జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ పోలీసులు గురువారం మహులిపుట్ ప్రాంతంలో గల అడవిలో బస్తాలతో ఉన్న 2 క్వింటాళ్ల 27 కేజీల గంజాయిను పట్టుకున్నారు.

- 10లో



వాహనం బోల్తాపడి డ్రైవర్ మృతి

వాహనం డివైడర్‌ను ఢీకొట్టి అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందిన ఘటన మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితిలో చోటుచేసుకుంది.

- 10లో

న్యూస్‌రీల్

కాంగ్రెస్ నుంచి ప్రీతీ పట్నాయక్ సస్పెన్షన్



జయపురం: స్థానిక అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి, దివంగత రఘునాథ్ పట్నాయక్ మనుమడు ప్రీతీష్ పట్నాయక్‌ను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ 6 ఏళ్లపాటు సస్పెన్షన్ వేటు వేసింది. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయిక్ ఆదేశానుసారం ప్రితీష్‌ను బహిష్కరించినట్లు పార్టీ క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు సంతోష్ సింగ్ సలూజ ఒక లేఖ ద్వారా తెలియజేసినట్లు కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శిశిభూషణ పాత్రో శుక్రవారం వెల్లడించారు. పార్టీ ఎన్నికల కమిటీ నిష్పత్తి మేరకు పార్టీ అభ్యర్థులను ప్రకటించడం జరిగిందని వెల్లడించారు. అయితే ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రితీష్ పట్నాయిక్ జయపురంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, అందువలన అతడిని పార్టీని నుంచి సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

6న పీఎం మోదీ బరంపురం రాక



మాట్లాడుతున్న బీజేపీ డా.ప్రదీప్ పాణిగ్రాహి తదితరులు

బరంపురం: ఈనెల 6వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ బరంపురం రానున్నట్లు గంజాం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సుభాష్ సాహు తెలియజేశారు. స్థానిక లంజిపల్లి బైపాస్ రోడ్డులోని బీజేపీ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బరంపురం లోక్‌సభ అభ్యర్థి డా.ప్రదీప్ పాణిగ్రాహి మాట్లాడుతూ ఆరోజు నగర శివారులోని కొనిసి గ్రామంలో జరగనున్న పార్టీ బహిరంగ సభలో పీఎం మోదీ ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. సభకు గంజాం, అస్కా, బంజనగర్, ఫుల్బణి, నయగడా జిల్లాలకి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరవ్వాలని కోరారు. సమావేశంలో బరంపురం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.అనిల్ కుమార్, యువమోర్చ రాష్ట్ర కార్యదర్శి సునీల్ సాహు, సినీ నటుడు సిద్ధాంత్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ముగ్గురికి గాయాలు



వైద్యం పొందుతున్న చిన్నారులు

రాయగడ: ఒక పక్షిని పట్టుకొనే ప్రయత్నంలో ముగ్గురు చిన్నారులు విద్యుత్ షాక్‌కు గురైన ఘటన పట్టణంలోని కొయిలాగుడ ప్రాంతంలో గురువారం చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం జరిగిన ఘటనలో జిసు బహదూర్, చంటి మండంగి, నరేష్ హిమిరికలు గాయాలుపాలయ్యారు. తీవ్రగాయాలైన వీరిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని కొయిలాగుడలో నివసిస్తున్న ముగ్గురు చిన్నారులు సమీపంలో ఆగివున్న గూడ్స్ రైలు భోగీపై పావురం పక్షి ఉండడం గమనించి, దానిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ముగ్గురూ రైలు భోగీ ఎక్కారు. అయితే వారికి రైలు భోగీపై ఉన్న విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురై కిందన పడిపోయారు. అక్కడ ఉన్నవారు వెంటనే వీరిని గుర్తించి వారి కుటుంబాలకు తెలియజేయడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వీరి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నప్పటికీ శరీరం కొంతవరకు కాలిపోవడంతో మరి కొద్దిరోజులు చికిత్స అవసరమని వైద్యులు సూచించారు. జిసు బహదూర్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కొరాపుట్ తరలించారు.

భద్రతపై సమీక్ష సమావేశం




సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

బరంపురం: ఈనెల 6వ తేదీన పీఎం నరేంద్రమోదీ బరంపురం పర్యటన నేపథ్యంలో బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) సమావేశ మందిరంలో పోలీసు, పాలన అధికారుల అత్యవసర సంయుక్త సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో బరంపురం పోలీసు జిల్లా ఎస్పీ సార్థక్ సడంగి, బీఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆశీర్వాద్ పరిడా, బరంపురం సబ్-కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రూట్ మ్యాప్ ఆధారంగా భద్రతపై సమీక్ష నిర్వహించారు. పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు.

బీజేడీ, బీజేపీ దొందూ దొందే



బహిరంగ సభకు హాజరైన జనం



భట్టి, సప్తగిరి తదితర నాయకులను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

- ఆ రెండు పార్టీలు రిజర్వేషన్లకు వ్యతిరేకం
- కాంగ్రెస్ శక్తిని ఎవరూ ఆపలేరు
- రాయగడ బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రాహుల్‌గాంధీ పర్యటన రద్దు: శ్రేణులు నిరుత్సాహం

రాహుల్ గాంధీ వీడియో సందేశం



సభా కార్యక్రమానికి అనివార్య కార్యక్రమాల కారణంగా హాజరు కాలేకపోయిన రాహుల్ గాంధీ వీడియో సందేశాన్ని పంపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి బీజేడీ, బీజేపీలను తరిమికొట్టాలని ఆరు నిమిషాల వీడియో సందేశంలో యువతకు విజ్ఞప్తి చేశారు.

రాయగడ: రాష్ట్రంలోని బీజేడీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాలు దొందూ దొందేనని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాయగడలోని జీఐఎసీఆర్ మైదానంలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచార బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పని తీరుపై విమర్శలు గుప్పించారు. వారి పాలనలో ప్రజలు అన్నివిధాల నష్టపోతున్నారన్నారు. వారు రిజర్వేషన్‌కు వ్యతిరేకులని.. అటువంటి వారికి ఈ ఎన్నికల్లో మరోసారి అవకాశం కల్పిస్తే రిజర్వేషన్ అనే పదాలు కనుమరుగవుతాయని ఆరోపించారు.

రాహుల్‌గాంధీ భవిష్యత్ ప్రధాని

కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి పేద, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశ భవిష్యత్ ప్రధానమంత్రి అని భట్టివిక్రమార్క అన్నారు. యువ నాయకుడు అధికారంలోకి వస్తే యువత భవిష్యత్ ఎంతో బాగుపడుతోందన్నారు. దేశంలో అనేక కొత్త మార్పులు చోటు చేసుకుంటాయని చెప్పారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కులాలపై కుట్ర చేస్తుంగా.. దానికి ఒడిశా ముఖ్యమంత్రిగా ఉన్న నవీన్‌పట్నాయక్ వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్లు రద్దు చేయాలన్న దృఢసంకల్పంతో ముందుకెళ్తున్న బీజేడీ, బీజేపీలకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



మండుటెండలో ప్రజలు

తాండవిస్తున్న నిరుద్యోగ సమస్య

ఒడిశా రాష్ట్రంలో అపారమైన ప్రకృతి వనరులు, ఖనిజ సంపదలు ఉన్నా ఇక్కడ నిరుద్యోగం విలయతాండవం చేస్తోందని భట్టి విక్రమార్క అన్నారు. విరివిగా లభించే బాక్సైట్ గనులను ప్రైవేట్ సంస్థలకు తాకట్టు పెట్టిన నవీన్ పట్నాయక్ నిరుద్యోగ సమస్యను ఎలా నిర్మూలించగలరని ప్రశ్నించారు. స్థానికంగా ఉపాధి లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్య రంగాల గురించి వేరే చెప్పనవసరం లేదన్నారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో సరైన సౌకర్యాల్లేక గర్భిణులను డోలీలపై మోసుకుంటూ ఆస్పత్రులకు తరలిస్తున్న ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయని అన్నారు. అలాగే వ్యవసాయ రంగానికి సరైన ప్రోత్సాహం అందించకపోవడంతో ఆయారంగాలు కుదేలైపోతున్నాయన్నారు.

కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వండి

సార్వత్రిక ఎన్నికల్లో ఈసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పించాలని భట్టి విక్రమార్క కోరారు. కాంగ్రెస్‌తోనే ప్రగతి సాధ్యపడుతుందని అన్నారు. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో ప్రజలు మార్పు తీసుకురావడంతో ప్రాజలు ఇప్పుడు అభివృద్ధిపై అడుగులు వేస్తున్నారని వివరించారు. ఇక్కడ ఇంకెన్నాళ్లు గుడ్డిగా నమ్మి నవీన్‌పట్నాయక్‌ను గెలిపిస్తారని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలు తీరి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలగాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు.

నవీన్ ప్రభుత్వానికి కాలం చెల్లింది: పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్

నవీన్ పట్నాయక్ ప్రభుత్వానికి కాలం చెల్లిందని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పటాన్నయక్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో మళ్లీ పూర్వవైభవం వస్తోందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. బీజేడీ పాలనలో మహిళలపై అత్యాచారాలు, దొంగతనాలు, దోపిడీలు శృతి మించిపోయాయని అన్నారు. ప్రజలు కళ్లు తెరవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలొ కొరాపుట్ లోక్‌సభ, విధాన సభల స్థానాల నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులు పాల్గొన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి చౌదరి, భక్త చరణ్ దాస్, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గిరిధర్ గొమాంగొ, మాజీ ఎంపీ జయరాం పంగీ, కొరాపుట్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిన పతి, నాయకులు భజబల్ మాఝి, పీసీసీ మాజీ అధ్యక్షుడు ప్రసాద్ హరిచందన్ మాట్లాడారు. మరికొందరు ఆదివాసీ నాయకులు ఆదివాసీ భాషలో ప్రసంగించారు.

సభలో పదనిసలు

రాహుల్‌గాంధీ సభలో పాల్గొంటారనే ఉద్దేశంతో జనం భారీగా సభకు తరలివచ్చారు. అయితే ఆయన పర్యటన రద్దయింది. ఈ సందర్భంగా సభలో పలు పదనిసలు చోటుచేసుకున్నాయి. తీవ్రమైన ఎండలో జనం అవస్థలు పడ్డారు. రాహుల్ గాంధీ పర్యటన రద్దు కావడంతో నిరాశతో చాలామంది మధ్యలోనే వెనుతిరిగి వెళ్లిపోయారు. స్థానిక సాయి ఇంటర్‌నేషనల్ నుంచి సభా వేదిక వరకు ట్రాఫిక్ నిలిచిపోవడంతో జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాహుల్ గాంధీ వస్తారని హెలిప్యాడ్ వద్ద జనం నిరీక్షించారు. అయితే ఆయన రావడం లేదని సభా వేదిక వద్దకు రావల్సిందిగా కాంగ్రెస్ నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సభకు హాజరైన వారికి కనీసం మంచినీటి సౌకర్యం కల్పించలేదని పలువురు గుసగుసలాడారు. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలుగు, హిందీ భాషల్లో ప్రసంగం ఆకట్టుకుంది

పేదల అభివృద్ధే సీఎం నవీన్ అజెండా



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న వీకే పాండ్యన్

- 5టీ చైర్మన్ వీకే పాండ్యన్

బరంపురం: రాష్ట్రంలోని పేద ప్రజల అభివృద్ధే సీఎం నవీన్ పట్నాయక్ అజెండా అని రాష్ట్ర 5టీ చైర్మన్ వీకే పాండ్యన్ అన్నారు. గంజాం జిల్లా భంజనగర్ మైదానంలో బీజేడీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బహిరంగ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత దశాబ్ద కాలంగా వచ్చిన ప్రకృతి వైపరీత్యాల వలన రాష్ట్రం అనేక ఇబ్బందులకు గురైందని పేర్కొన్నారు. అటువంటి సమయంలోనూ ఎవరి సహాయం తీసుకోకుండా ప్రజల అభివృద్ధికి కోసం బీజేడీ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని గుర్తు చేశారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పట్టించుకోని కేంద్ర బీజేపీ పెద్దలు ఇప్పుడు ప్రజలపై సవతి ప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కలియా పథకం, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థులకు ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

బీజేడీతోనే సంక్షేమ పథకాలు

రాష్ట్రంలో బీజేడీ హయాంలోనే ప్రజలకు సక్రమంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని పాండ్యన్ పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పథకాలు అందజేస్తున్నట్లు తెలియజేశారు. రాష్ట్రంలోని 4.5 కోట్ల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సీఎం నవీన్ ముందడుగు వేస్తున్నట్లు పేర్కొన్నారు. గడిచిన 21 ఏళ్ల పాలనలో విద్య, వైద్యం, తాగు-సాగు నీరు, రహదారుల నిర్మాణం, వంటి వివిధ అభివృద్ధి పథకాలు సీఎం నవీన్ అమలు చేసినట్లు చెప్పారు. దేశంలో మొట్టమొదటి సారిగి గంజాం జిల్లాలో ఎన్ఏసీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిల్లో బస్తీవాసులకు 'భూమి అధికారి' పట్టాలు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి విక్రమ్ కేషరి అరక్, బీజేడీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు, నాయకులు పాల్గొన్నారు.



ప్రజలతో సెల్ఫీ దిగుతున్న పాండ్యన్

బీజేపీ కార్యాలయం ప్రారంభం



బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న గౌతమ్ సామంతరాయ్

జయపురం: జయపురం నియోజకవర్గ పరిధిలోని బొరిగుమ్మలో బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌతమ్ సామంతరాయ్ శుక్రవారం ప్రారంభించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన సామంతరాయ్ బొరిగుమ్మ బస్సు స్టాండ్ నుంచి వందలాది మంది పార్టీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పాత బోరిగుమ్మ ప్రాంతానికి చేరి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అక్కడ నుంచి పార్టీ కార్యకర్తలతో నడుచుకుంటూ బొరిగుమ్మ వీధుల్లోనూ, ప్రధాన మార్గాల్లోనూ పర్యటించారు. సామంతరాయ్ ప్రతీ దుకాణానికి, ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలసి పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలించాలని అభ్యర్థించారు. బీజేపీ బొరిగుమ్మ మండల్ అధ్యక్షుడు రాజా సింగ్, శంకర మహంతి, విఘ్నేశ్వర షాడంగి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కలశయాత్ర



కలశ యాత్రలో భక్తజనం

భువనేశ్వర్: ఖుర్దారోడ్ ట్రాఫిక్ కాలనీ షిర్డీ సాయిబాబా ఆలయ మహోత్సవం ఉత్సాహంగా జరుగుతోంది. ఇందులో భాగంగా పట్టణ వీధుల్లో కలశ యాత్రను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. స్థానిక హట్ బజారు చెరువు నుంచి సేకరించిన జలంతో దేవస్థానం వరకు ఈ యాత్ర కొనసాగింది. భక్తులు సేకరించిన జలంతో ప్రత్యక్షంగా సాయినాథునికి అభిషేకించారు. ధనంజయ ఆచార్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో యాగశాల సంస్కరణ, మండప ఆరాధన, అగ్ని ప్రతిష్ట కార్యక్రమాలు జరిగాయి. ఈ నెల ఐదో తేదీ వరకు మహోత్సవాలు కొనసాగుతాయని దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త వెలగడ సాయిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా నిత్యం మంగళ ధ్వని, వేద పారాయణం కార్యక్రమాలతో మండల అర్చన, జ్యోతిర్లింగ అర్చన, విశేష బిల్వార్చన, భస్మాభిషేకం వంటి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు.



షిర్డీసాయి నాథుని ఘటాభిషేకం

చైన్ స్నాచింగ్ దొంగలు పట్టుబడ్డారు

- ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు
- చోరీసొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో మాధవనంద నాయక్

పర్లాకిమిడి: మధ్య వయసు మహిళలే లక్ష్యంగా చేసుకొని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నారు. రెండు నెలలుగా గజపతి జిల్లా గురండి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన ఏడు దొంగతనాల కేసులను ఛేదించినట్టు సబ్ డివిజనల్ పోలీసుస్టేషన్ అధికారి మాధవనంద నాయక్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టుబడిన ఇద్దరు నిందితుల నుంచి 85 గ్రాముల బంగారం, ఒక బైక్, మొబైల్‌ను స్వాధీనం చేసుకుని వారిని కోర్టులో హాజరుపరిచారు. కేసుల గురించి వివరిస్తూ ఈ ఏడాది మార్చి 23వ తేదీన లింగిపురం గ్రామవాసి సనపాల తేజేశ్వరరావు వదిన ఎస్.భానుమతి లింగిపురం వంతెన వద్ద మినుములు ఎండవేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమెపై దాడి చేసి మెడలోని బగారు పుస్తెల తాడును తెంచుకొని పారిపోయారు. ఈ ఘటనపై సనపాల తేజేశ్వరరావు గురండి పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐఐసీ రవీంద్రపాత్రో దర్యాప్తు చేశారు. గురువారం రాత్రి పెట్రోలింగ్ జరుపుతుండగా లింగిపురం వంతెన వద్ద పర్లాకిమిడికి చెందిన సుజిత్ కుమార్ పాఢి, గంజాం జిల్లా పెద్దబజార్‌కు చెందిన బాలక్రిష్ణ సాహు అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాలను ఒప్పుకున్నట్టు వివరించారు. దొంగిలించిన బంగారం వస్తువులను ఇచ్ఛాపురం, బరంపురం, జోరడా పట్టణాల్లో విక్రయించినట్టు నిందితులు అంగీకరించినట్టు పోలీసు అధికారి వివరించారు. అలాగే మరికొంత బంగారం నిందితుడు సుజిత్ కుమార్ పాఢికి చెందిన గజపతినగరం, పర్లాకిమిడిలోని ఇళ్లలో దొరికినటుట చెప్పారు. పర్లాకిమిడి ఎస్‌డీపీవో మాధవ నంద నాయక్ ఇద్దరు నిందితుల్ని ఇంటరాగేషన్ చేసిన తరువాత ఏడు దొంగతనాల్లో వీరిద్దరి పాత్ర ఉన్నట్టు పేర్కొన్నారు. వీరివద్ద నుంచి మూడు బంగారు పుస్తెల తాళ్లు, ఒక జత చెవుకమ్మలు, ఐదు గొలుసులు, ఒక మొబైల్ ఫోను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాన్ని కూడా ఛత్రపూర్‌లో చోరీ చేసి ఫేక్ రిజిస్ట్రేషన్‌తో తిరుగుతున్నట్టు తమ దర్యాప్తులో తేలిందన్నారు. సమావేశంలో గురండి పోలీసు ఐఐసీ రవీంద్ర పాత్రో ఉన్నారు.

పర్లాకిమిడిలో కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్



పర్లాకిమిడి పురవీధుల్లో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న కేంద్రబలగాలు

పర్లాకిమిడి: సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ప్రజల్లో అవగాహన కోసం పర్లాకిమిడిలో కేంద్ర పోలీసు బలగాలు శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. బెత్తగుడ పోలీసు రిజర్వుడు బ్యారక్ నుంచి కొత్త బస్టాండు, మార్కెట్, రాజవీధి, జయమహల్ మీదుగా మూడు ప్లాటూన్ల సీఆర్‌పీఎఫ్, ఏపీఆర్, స్థానిక పోలీసులు కవాతు జరిపారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా పోలీసు దళాలు కవాతు జరిపినట్టు ఆదర్శ పోలీసుస్టేషన్ ఐఐసీ ప్రశాంత ఝుభూపతి తెలిపారు.

క్లుప్తంగా

బీజేపీలో చేరిన బీజేడీ నాయకురాలు



ఇందిరా పట్నాయక్‌కు బీజేపీ కండువా వేస్తున్న నాయకులు

పర్లాకిమిడి: బిజూ జనతాదళ్ పార్టీ జీవన బిందు జిల్లా కోఆర్డినేటర్ ఇందిరా పట్నాయక్ శుక్రవారం బీజేపీలో చేరారు. ఇందిరా పట్నాయక్ బీజేడీ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆ పార్టీలో సీనియర్ల వేధింపులు తట్టుకోలేక రాజీనామా చేసినట్టు విలేకరులకు తెలిపారు. ఆమెకు బీజేపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు కమలం కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పృథ్విరాజ్ చౌహాన్, నృసింహచరణ్ పట్నాయక్, కౌన్సిలరు బాలికృష్ణ పాత్రో ఉన్నారు.

తొలి దశ బరిలో 37 మంది

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలి విడత ఎన్నికల్లో 4 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో పోటీకి బరిలో 37 మంది అభ్యర్థులు ఉన్నట్లు ఎన్నికల సంఘం శుక్రవారం ప్రకటించింది. ఈ 4 లోక్‌సభ స్థానాల పరిధిలో పోటీ కోసం సమగ్రంగా 75 నామినేషన్లు దాఖలయ్యాయి. పరిశీలన దశలో 38 మంది పోటీకి అర్హులుగా ఈసీఐ ప్రకటించింది. అయితే వీరిలో ఒక అభ్యర్థి పోటీ నుంచి వైదొలగడంతో చిట్ట చివరిగా తొలి దశ పోలింగ్‌కు 37 మంది అభ్యర్థులు మాత్రమే బరిలో మిగిలారు. మరోవైపు రెండో విడత పోలింగ్‌లో పోటీ చేసేందుకు ఔత్సాహిక అభ్యర్థుల నామినేషను దాఖలు గడువు శుక్రవారంతో ముగిసింది. వీటిని శనివారం పరిశీలిస్తారు. తదుపరి ఈనెల 6 వరకు పోటీ నుంచి వైదొలిగేందుకు నామినేషన్ పత్రాల ఉపసంహరణకు భారత ఎన్నికల సంఘం గడువు కల్పించింది. అనంతరం మలి విడతలో చివరగా మిగిలిన అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తుంది.

గడ్డివాము దగ్ధం



కాలిపోతున్న గడ్డి

బూర్జ: మండలంలోని టీఆర్ రాజుపేటలో లావేటి బలరాజు(పెద్దయ్య)కు చెందిన సుమారు 15 ఎకరాల గడ్డి వాము శుక్రవారం మధ్యాహ్నం దగ్ధమైంది. ప్రమాదానికి గల కారణం తెలియలేదు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. అదే విధంగా, గురువారం అర్ధ రాత్రి లచ్చయ్యపేటలో రైతులు గిరడ అప్పల నాయుడు, కొంచాడ స్వామినాయుడు, కింతలి కిరణ్‌కుమార్, రాయపురెడ్డి సింహాద్రిలకు చెందిన 10 ఎకరాల నీలగిరి తోటలు కూడా అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి.

రోడ్డుపై కుప్పకూలి ఉపాధ్యాయుడు మృతి



ఘటనా స్థలంలో షణ్ముఖరావు

కాశీబుగ్గ: రోడ్డుపై కుప్పకూలి గాయపడిన ఘటనలో మందస గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు ఎ.షణ్ముఖరావు(44) శుక్రవారం మృతిచెందారు. గురువారం బైక్‌పై వెళ్తుండగా జాతీయ రహదారిపై ఒక్కసారిగా కుప్పకూలి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు సమీపంలోని హరిపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యసేవలు అందించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిఫర్ చేయగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. షణ్ముఖరావు వడదెబ్బకు గురై కుప్పకూలి ఉండవచ్చని గ్రామస్తులు భావిస్తున్నారు. ఈయన పలాస మండలం శాసనాం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

పెళ్లి కావడం లేదని యువకుడు ఆత్మహత్య

రణస్థలం: లావేరు మండలం తాళ్లవలస గ్రామానికి చెందిన ముంగం సాయికోటి(26) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జె.ఆర్.పురం పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లగేజీ ఆటో నడుపుతున్న సాయికోటికి ఇటీవల నాలుగు పెళ్లి సంబంధాలు చూశారు. అయినా పెళ్లి కుదరకపోవడంతో గురువారం మధ్యాహ్నం రణస్థలం మండలం బంటుపల్లి సమీపంలో రాధాగోవింద మందిరం సమీపంలో పురుగుల మందు తాగాడు. ఈ విషయం పెద్దక్కకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే బావ ఈశ్వరరావు ఘటన స్థలానికి చేరుకుని 108 అంబులెన్సులో రణస్థలం సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 10గంటల సమయంలో మృతి చెందాడు. తండ్రి శంకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జే.ఆర్.పురం ఏఎస్సై లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవరంగపూర్ ఎంపీ స్థానానికి.. త్రిముఖ పోటీ



బుజభల మఝి (కాంగ్రెస్)



ప్రదీప్ మఝి (బీజేడీ)



బలభద్ర మఝి (బీజేపీ)

జయపురం: నవరంగపూర్ (ఎస్టీ) లోక్ సభ స్థానంలో నలుగురు బరిలో ఉండగా.. వారిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ముగ్గురు మఝి సంప్రదాయ గిరిజనులే. కాంగ్రెస్ అభ్యర్థిగా భుజబల మఝి, బీజేడి అభ్యర్థిగా ప్రదీప్ మఝి, బీజేపీ అభ్యర్థిగా బలభద్ర మఝి పోటీలో తలపడనున్నారు. ఈ నియోజకవర్గంలో బరిలో ఉన్న సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) పార్టీ అభ్యర్థి త్రినాథ్ మండగుడియ పోటీలో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో 1952, 1962 ఎన్నికల్లో ఇద్దరు తెలుగువారు ఎన్నకయ్యారు. 1952లో పొన్నాడ సుబ్బారావు (గణతంత్ర పరిషత్) గెలుపొందారు. 1962 ఎన్నికల నాటికి నవరంగపూర్ లోక్ సభ నియోజకవర్గం తిరిగి జనరల్ స్థానంగా విభజించారు. ఆ ఎన్నికలో మరో తెలుగు నేత రాచకొండ జగన్నాథరావు(కాంగ్రెస్) విజయం సాధించారు. 1967లో ఈ స్థానాన్ని ఎస్టీలకు కేటాయించారు. ఈ ఎన్నికలలో ఖగపతి ప్రధాన్ (కాంగ్రెస్) గెలిపొందారు. తరువాత జరిగిన 1971, 1977, 1980, 1984, 1989, 1991, 1996, 1998 ఎన్నికల్లో ఈయన వరుసగా విజయాలు సాధించారు. ఈయన తరువాత నవరంగపూర్ నియోజకవర్గంలో మఝి సంప్రదాయ నేతల ఆధిపత్యం లోనికి వచ్చింది. 1999 ఎన్నికల్లో ఈ స్థానం బీజేపీ కైవసం చేసుకుంది. ఆ పార్టీ అభ్యర్థి పరశురాం మఝి విజయం సాధించారు. 2004లో జరిగిన ఎన్నికల్లో కూడా బీజేపీ అభ్యర్థి పరశురాం మఝి ఈ స్థానాన్ని దక్కించుకున్నారు. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రదీప్ కుమార్ మఝి మొదటి సారిగా ఎన్నికల బరిలో దిగి బీజేపీ అభ్యర్థి పరశురాం మఝిని, బీజేడీ అభ్యర్థి డొంబురు మఝిలను ఓడించారు. 2004లో ఈ స్థానంలో ఘన విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి పరశురా మఝి 2009లో కేవలం 1,56,784(19.8 శాతం) ఓట్లు మాత్రం పొంది మూడో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రదీప్ మఝి 3,08,307 (38.93 శాతం) ఓట్లు పొందారు. బీజేడీ అభ్యర్థి డొంబురు మఝి 2,78,330 (35.15శాతం) ఓట్లు సాధించారు. 1999, 2004 ఎన్నికల్లో బీజేపీ విజయానికి బలమైన కారణం ఉమ్మరకోట్, ఝోరాగాం, మలకనగిరి, చిత్రకొండ అసెంబ్లీ సెగ్మెంట్లలో శరణార్థ బెంగాలీల ఓట్లు వల్లేనని పరిశీలకుల విశ్లేషణ. తరువాత పరిస్థితులు మారాయి. 2009లో కాంగ్రెస్ విజయం సాధించింది. 2014 లో బీజేడీ అభ్యర్థి బలభద్ర మఝి గెలిపొందారు. సిట్టింగ్ ఎంపీ అయిన కాంగ్రెస్ అభ్యర్థి పరశురాం మఝిని కేవలం 2042 ఓట్ల తేడాతో ఓడించారు. ఈ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు విజయం సాధించిన బీజేపీ ఓట్ల శాతం పడిపోయి మూడో స్థానానికే పరిమితమైంది.

2019లో ఈ నియోజకవర్గంలో చతుర్ముఖ పోటీ జరిగింది. కాంగ్రెస్ నుంచి ప్రదీప్ మఝి, బీజేడీ నుంచి రమేష్ చంద్ర మఝి, బీజేపీ నుంచి బలభద్ర మఝి, బీఎస్పీ నుంచి చంద్రధ్వజ మఝి తలపడ్డారు. ఆ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య గట్టి పోటీ జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థిపై 41,724 ఓట్ల తేడాతో బీజేడీ అభ్యర్థి రమేష్ మఝి విజయం సాధించారు. బీజేడీకి 3,92,504 ఓట్లు రాగా.. కాంగ్రెస్‌కు 3,50,870 ఓట్లు, బీజేపీకి 3,42,839 ఓట్లు, బీఎస్పీకి 28,905 ఓట్లు, నోటాకు 44,582 ఓట్లు పడ్డాయి. ఈ ఎన్నికల్లో 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో రెండు చోట్ల బీజేపీ విజయం సాధించగా.. 5 చోట్ల బీజేడీ అభ్యర్థులు గెలుపొందారు. 41 వేల ఓట్లతో పరాజయం పొంది రెండో స్థానంలో నిలిచిన కాంగ్రెస్‌కు ఒక్క అసెంబ్లీ స్థానం దక్కలేదు. ఈ నెల 13వ తేదీన జరుగనున్న ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో చతుర్ముఖ పోటీ ఉండనుంది. 2019లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందిన మాజీ ఎంపీ ప్రదీప్ మఝి బీజేడీలో చేరారు. నేడు ఈయన బీజేడీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. 2014లో బీజేడీ టికెటుపై పోటీ చేసి విజయం సాధించిన బలభద్ర మఝి ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగారు. కాంగ్రెస్ అభ్యర్థిగా డాబుగాం ఎమ్మెల్యే భుజబల మఝి తలపడుతున్నారు. ప్రధానమైన పోటీ కాంగ్రెస్, బీజేడీ, బీజేపీల మధ్యేనే ఉంటుందని పరిశీలకుల విశ్లేషణ. నవరంగపూర్ పార్లమెంట్ నియోజకవర్గంలో నవరంగపూర్ జిల్లా నుంచి నవరంగపూర్, డాబుగాం, ఉమ్మరకోట్, జోరిగాం, కొరాపుట్ జిల్లాలోని కొట్‌పాడ్, మల్కనగిరి జిల్లాలో మల్కనగిరి, చిత్రకొండ అసెంబ్లీ సెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి.

కొరాపుట్ జిల్లాలో.. మహిళా ఓటర్లే నిర్ణేతలు



మహిళా ఓటర్లు

- మొత్తం ఓటర్లు 9,69,092 మంది
- మహిళలు 5,00,405 మంది
- పురుషులు 4,68,604 మంది
- ట్రాన్స్‌జెండర్స్ 83 మంది

జయపురం: ఈ నెల 13వ తేదీన జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కొరాపుట్ జిల్లాలో మహిళా ఓటర్లే అధికం. ఈ జిల్లాలో 9,69,092 మంది ఓటర్లు ఉండగా.. వారిలో 5,00,405 మంది మహిళలు, 4,68,604 మంది పురుషులు, 83 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. లక్ష్మీపూర్, కొరాపుట్, పొట్టంగి, జయపురం, కొట్‌పాడ్ అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి.

➢ లక్ష్మీపూర్(ఎస్టీ-141)లో 1,72,483 మంది ఓటర్లు ఉండగా.. వారిలో 90,732 మంది మహిళలు, 81,732 మంది పురుషులు, 19 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు.

➢ కొట్‌పాడ్(ఎస్టీ 142) నియోజకవర్గంలో 2,08,283 మంది ఓట్లు ఉండగా.. వారిలో 1,07,191 మంది మహిళా ఓటర్లు, 1,01,081 మంది పురుషులు,11 మంది ట్రన్స్‌జెండర్స్ ఉన్నారు.

➢ జయపురం (జనరల్-143)నియోజకవర్గంలో 2,11,908 ఓటర్లు ఉండగా.. 1,09,104 మంది మహిళా ఓటర్లు, 1,02,770 మంది పురుషులు, 34 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు.

➢ కొరాపుట్ (ఎస్సీ-144) నియోజకవర్గంలో 1,90,341 మంది ఓటర్లు ఉండగా.. వారిలో 97408 మంది మహిళలు, 92,921 మంది పురుషులు, 12 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు.

➢ పొట్టంగి (ఎస్టీ-145) నియోజకవర్గంలో 2,76,182 మంది ఓటర్లు ఉండగా.. వారిలో 1,86,076 మంది మహిళా ఓటర్లు ఉండగా.. 90,100 మంది పురుష ఓటర్లు, ఆరుగురు ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు.

➢ జిల్లాలో మొత్తం ఓటర్లలో మొదటిసారి 22,500 మంది ఓటు హక్కును వినియోగించుకుంచుకోనున్నారు.

➢ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 1158 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయనుండగా వాటిలో కొరాపుట్ నియోజకవర్గంలో 215 బూత్‌లు, పొట్టంగిలో 238 బూత్‌లు, లక్ష్మీపూర్‌లో 225, జయపురంలో 237, కొట్‌పాడ్‌లో 243 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

➢ ఐదు నియోజకవర్గాలలో 1158 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తుండగా పట్టణాల్లో గల బూత్‌లలో మరో 129 నుంచి 150 వరకు అదనపు బూత్‌లు ఏర్పాటు చేస్తారు. ఇవి కేవలం మహిళా పోలింగ్ టీమ్‌లు నిర్వహిస్తాయి. ముఖ్యంగా ఈ అదనపు బూత్‌లు జయపురం, కొరాపుట్, కొట్‌పాడ్, సునాబెడలలో ఏర్పాటు చేస్తారు. ఈ ఎన్నికలో మొదటిసారి 85 ఏళ్లకు పైబడిన వారికి ఇంటి వద్దనే ఓటు వేసుకునే హక్కు కల్పించారు.

అసంతృప్తులకు పదవులు

- బీజేడీ రాష్ట్ర కార్యదర్శిగా సుభాష్ రౌత్



బీజేడీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సుభాష్ రౌత్



త్రిపుర మాజీ సీఎం విప్లవ కుమార్ దేవ్‌తో బీజేపీ నేత హిమాంశు మహాపాత్రో

జయపురం: జయపురం శాసనసభ స్థానం నుంచి బీజేపీ, బీజేడీ టికెట్‌పై పోటీ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించిన ఆశావాదులకు టికెట్ లభించకపోవటంతో వారు అసంతృప్తి చెందారు. పార్టీ అభ్యర్థుల విజయానికి అసమ్మతివాదుల వల్ల కొంత నష్టం కలుగుతుందనటంలో సందేహంలేదు. ఈ విషయాన్ని గ్రహించిన ఆయా పార్టీలు వారిని సంతృప్తిపరచేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి. బీజేడీ క్రియాశీలక నేత, ప్రముఖ వ్యాపారి సుభాష్ రౌత్‌కు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈ విషయాన్ని బీజేడీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రణయ ప్రకాశ్ దాస్ వెల్లడించారు. సుభాష్ రౌత్‌ని కార్యదర్శిగా ముఖ్యమంత్రి, బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ నియమించారన్నారు. పార్టీ టికెట్ కోసం రౌత్ విశ్వప్రయత్నం చేశారు. ఈయనకు టికెట్ లభించలేదు. పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా చర్యలు చేపట్టకుండా ఈయనకు రాష్ట్ర కార్యదర్శిగా నియమించారని పరిశీలకుల అభిప్రాయం. బీజేపీ కూడా అసంతృప్తులను బుజ్జగించేందుకు ప్రయత్నిస్తోంది. జయపురంలో బీజేపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన వారిలో గౌతమ సామంతరాయ్, హిమాంషు మహాపాత్రో ఉన్నారు. వీరు పోటీపడి తమ శక్తిని ప్రదర్శించారు. హోలీ పండగలో ఇరువురు వేర్వేరు టెంట్లు వేసి తమ అనుచరులతో పండగ చేసి వారిలో విబేధాలను బయటపెట్టారు. గౌతమ సామంతరాయ్‌కు టికెట్ కేటాయించడంతో హిమాంశులో తలెత్తిన అసంతృప్తిని తొలగించేందుకు పార్టీ ప్రయత్నాలు చేపట్టింది. నవరంగపూర్, మల్కనగిరి జిల్లాల్లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన బీజేపీ నేత త్రిపుర మాజీ ముఖ్యమంత్రి విప్లవ కుమార్ దేవ్‌ను హిమాంశును బుజ్జగించేందుకు ఆ పార్టీ అధిష్ఠానం పంపింది. గత రెండు రోజులుగా విప్లవకుమార్ దేవ్ జయపురంలో ఒక హోటల్‌లో బస చేశారు. పార్టీలో అసంతృప్తివాదులను పిలిపించి బుజ్జగిస్తున్నట్లు సమాచారం. పార్టీ టికెట్ కోసం ప్రయత్నించి నిరాస చెందిన హిమాంషు మహాపాత్రో, శుదాంషు జెనను కూడా హోటల్‌కు పిలిపించి వారితో మాట్లాడి పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరినట్లు తెలిసింది.

25 కిలోల గంజాయి స్వాధీనం

- ఒకరి అరెస్టు



అరెస్టయిన రహితాన్ మీన

మల్కన్‌గిరి: గంజాయి రవాణా గుట్టురట్టయింది. వాహనాలు తనిఖీ చేస్తుండగా పికప్ వ్యాన్‌లో తరలిస్తున్న 25 కిలోల గంజాయి పట్టుబడింది. మలకన్‌గిరి పోలీసులు గురువారం రాత్రి ఐఐసీ రీగాన్ కీండో పర్యవేక్షణలో పెట్రోలింగ్ చేస్తుండగా గొడిగూఢ గ్రామం రోడ్డులో పికప్ వ్యాన్ వేగంగా రావడాన్ని గమనించారు. అనుమానంతో దాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 25 కిలోల గంజాయి బస్తా లభ్యమైంది. వ్యాన్ డ్రైవన్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. శుక్రవారం డ్రైవర్‌ను పోలీసులు విచారించగా రాజిస్థాన్‌కు చెందిన రహితాన్ మీనగా గుర్తించారు. ఆతన్ని కోర్టులో హాజరు పరిచారు. పట్టుబడిన గంజాయి విలువ లక్షన్నర రూపాయలు ఉంటుందని ఐఐసీ రీగాన్ కీండో తెలిపారు.

రాయగడలో త్రిపుర మాజీ సీఎం పర్యటన నేడు



విప్లవ్ కుమార్ దేవ్

రాయగడ: జిల్లాలో త్రిపుర మాజీ సీఎం విప్లవ్ కుమార్ దేవ్ శని, ఆదివారాల్లో పర్యటించనున్నారు. ఆయన పర్యటన వివరాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ శుక్రవారం వెల్లడించారు. కొరాపుట్ జిల్లా జయపురం నుంచి ఆయన బయల్దేరి ఉదయం 10.30 గంటలకు రాయగడ చేరుకుంటారు. సిరగుడలోని బీజేపీ కార్యాలయంలో కాసేపు కార్యకర్తలతో మాట్లాడుతారు. అనంతరం గుణుపూర్‌లోని నిమంత్రణ కల్యాణ మండపంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. గుణుపూర్ నుంచి తెరువలి చేరుకుని సాయంత్రం 4.30 గంటలకు తెరువలి డీపీ క్యాంప్‌లో జరగనున్న కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. తదుపరి ఆదివారం ఉదయం 8.45 గంటలకు రాయగడలోని మజ్జిగౌరి అమ్మవారి మందిరానికి వచ్చి అమ్మవారి దర్శనం చేసుకుంటారు. ఉదయం 11.45 గంటలకు పిప్పలగుడ పంచాయతీలోని బడఅలుబడి గ్రామంలో జరగనున్న బహిరంగ సభలో పాల్గొంటారు.

నేడు సీఎం నవీన్ పట్నాయక్ పర్యటన



పర్లాకిమిడి గజపతి స్టేడియంలో సిద్ధమవుతున్న సభా స్థలం

పర్లాకిమిడి: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ప్రచార నేపథ్యంలో ముఖ్యమంత్రి, బీజేడీ పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ శనివారం పర్లాకిమిడి పర్యటనకు రానున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ శుక్రవారం తెలియజేశారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నవరంగ్‌పూర్, కోరాపుట్, రాయగడ జిల్లాల నుంచి పర్లాకిమిడి గజపతి స్టేడియంలో హెలికాప్టర్‌లో దిగి నేరుగా రోడ్డుంకు వెళ్లారు.

టికిరిలో..

రాయగడ: సీఎం నవీన్ పట్నాయక్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో శనివారం పర్యటించనున్నారు. టికిరిలో గల ముచికిపాదొరొ మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 3.30 గంటలకు ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో చేరుకుని ప్రసంగిస్తారు. ఏర్పాట్లను బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరావు ప్రత్యేకంగా సమీక్షించారు. శుక్రవారం సభా వేదిక వద్దకు వెళ్లి ఏర్పాట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గుమ్మాలో బీజేడీ అభ్యర్థి ప్రచారం



మునిసింగిలోని చర్చి వద్ద రూపేష్



ఉక్కురా గ్రామంలో ప్రసంగిస్తున్న రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: పర్లాకిమిడి అసెంబ్లీ నియోజగవర్గ బీజేడీ పార్టీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి గుమ్మా బ్లాక్ ఉక్కురా, మునిసింగి గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఏజెన్సీ ఏరియా ఉక్కురా, మునిసింగి పంచాయతీల్లో మైనార్టీ ప్రజలతో సమావేశమై తన విజయానికి సహకరించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఈ ప్రాంతాభివృద్ధికి పలు పథకాల అమలు కోసం నిధులు మంజూరు చేశారన్నారు. వాటిల్లో చర్చిల పుణరుద్ధరణ, రోడ్ల అభివృద్ధి, మంచినీటి సౌకర్య, మిషన్ శక్తి భవనాలు సమకూర్చారన్నారు. శంఖం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో నాయకులు తిరుపతి పాణిగ్రాహి, మాజీ ఎమ్మెల్యే కెంగం సూర్యారావు, గుమ్మా బీజేడీ నాయకులు పల్లవ్ లిమ్మా తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి బీజేపీ అభ్యర్థిగా సంతోష్ ఖటువా

- ఖారవేళ స్వయి అసంతృప్తి

భువనేశ్వర్: బాలాసోర్ జిల్లా నీలగిరి శాసన సభ నియోజకవర్గం నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పట్ల సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ శుక్రవారం నీలగిరి స్థానం నుంచి పోటీ చేయనున్న అభ్యర్థిగా సంతోష్ ఖటువాను ప్రకటించడంతో ఉత్కంఠకు తెరపడింది. ఈ ప్రకటనతో బాలాసోర్ మాజీ ఎంపీ ఖారవేళ స్వయి తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఈ ఏడాది మార్చిలో బీజేపీకి రాజీనామా చేసి బీజేడీలో చేరిన నీలగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే, బిజూ జనతా దళ్ అభ్యర్థి సుకాంత నాయక్‌తో సంతోష్ ఖటువా పోటీ చేయనున్నారు. అధికార పక్షం బీజేడీ నీలగిరి స్థానం నుంచి అభ్యర్థిని ప్రకటించేంత వరకు బీజేపీ నిరీక్షించింది. బీజేపీ ఫిరాయించి ప్రాంతీయ పార్టీ బీజేడీలో చేరిన నీలగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే సుకాంత నాయక్‌ను పోటీకి ఖరారు చేయడంతో బీజేడీకి గుడ్ బై పలికి బీజేపీలో చేరిన మర్నాడు సంతోష్ ఖటువాకు అభ్యర్థిత్వం ఖరారు చేయడం విశేషం. సుకాంత నాయక్ 2014, 2019లో వరుసగా రెండు సార్లు నీలగిరి సీటును గెలుచుకున్నారు. అతను 2014 ఎన్నికల్లో బిజూ జనతా దళ్ అభ్యర్థిగా గెలిచాడు. గత ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీ చేసి 1,577 ఓట్ల తేడాతో సంతోష్ ఖటువాను ఓడించాడు. ఈ ఏడాది మార్చి 31న తిరిగి బిజూ జనతా దళ్‌లో చేరి టికెటు సాధించాడు. దీంతో సుకాంత నాయక్, సంతోష్ ఖటువా మళ్లీ ఈ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. బాలాసోర్ ఎంపీ అభ్యర్థి ప్రతాప్ చంద్ర షడంగిని నీలగిరి శాసన సభ నియోజక వర్గానికి మార్చి, ఆయనకు బదులుగా పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని ఈ నియోజకవర్గం మాజీ ఎంపీ ఖర ఖారవేళ స్వయి బీజేపీ నాయకత్వాన్ని అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో సీట్ల సర్దుబాటు ప్రతిపాదనకు తాజా ప్రకటన తెరదించింది.

రెండు క్వింటాళ్ల గంజాయి స్వాధీనం



అడవిలో పట్టుబడిన గంజాయి బస్తాలు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ పోలీసులు గురువారం మహులిపుట్ ప్రాంతంలో గల అడవిలో బస్తాలతో ఉన్న 2 క్వింటాళ్ల 27 కేజీల గంజాయిను పట్టుకున్నారు. ఈ సంఘటనలో ఎక్కరూ పట్టుబడలేదని బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజళి ప్రధాన్ వెల్లడించారు. విశ్వాసనీయ వర్గాల ద్వారా సమాచారం అందిన వెంటనే బొయిపరిగుడ పోలీసులు మహులిపుట్ వెళ్లి గ్రామ సమీప ప్రాంతాల్లో గాలింపు ప్రారంభించారు. అడవిలో పలు ప్రాంతాల్లో గాలించిన పోలీసులకు అడవిలో గంజాయి బస్తాలు గుర్తించారు. గంజాయిని దొంగతనంగా తరలించేందుకు ఉంచిన వ్యక్తులు కనిపించలేదని పోలీసు అధికారి వెల్లడించారు. పట్టుబడిన గంజాయి బస్తాలను పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చి తూకం వేశామన్నారు. బొయిపరిగుడ సమితి ప్రాంతంలో గ్రామీణ ప్రజలు పెద్ద ఎత్తున గంజాయి సాగు చేస్తున్నారని, వారికి గంజాయి మాఫియా ప్రోత్సహిస్తుందని పోలీసులు అనుమానిస్తున్నారు. అడవిలో గంజాయి దాచిన వారిని పట్టుకునేందుకు విస్తృతంగా గాలిస్తున్నామని పోలీసు అధికారి వెల్లడించారు. ఈ దాడిని ఎస్ఐ డి.బారిక్ నేతృత్వంలో ఒక టీమ్ జరిపిందన్నారు.

వాహనం బోల్తాపడి డ్రైవర్ మృతి



ప్రమాదానికి గురైన వాహనం

మల్కన్‌గిరి: వాహనం డివైడర్‌ను ఢీకొట్టి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి మాంత్రీపూట్ గ్రామం వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐజాక్సే వాహనం బలిమెల నుంచి చిత్రకొండకు వస్తుంది. మాంత్రీపూట్ గ్రామం దాటిన తరువాత ఘట్టీపైకి వెళ్లే క్రమంలో డివైడర్‌ను ఢీకొట్టి అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో డ్రైవర్ కిందకు దిగే క్రమంలో అదేవాహనం చక్రాల కిందపడిపోవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. చిత్రకొండ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డ్రైవర్ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థంలో లభ్యమైన ఆధార్ కార్డు ఆధారంగా డ్రైవర్‌ది మోహిర్‌భంజ్ జిల్లా దేవులి గ్రామానికి చెందిన సమీర్‌ధల్ (39)గా పోలీసులు గుర్తించారు. ప్రమాదంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో తాపీమేస్త్రి మృతి

ఇచ్ఛాపురం రూరల్: గత తొమ్మిది రోజులుగా కనిపించకుండాపోయిన తాపీమేస్త్రీ మామిడి చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించిన ఘటన శుక్రవారం ఇచ్ఛాపురం మండలంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ ఎన్.లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం..గార మండలం పొగాకువానిపేటకు చెందిన నీలాపు సూర్యనారాయణ(68) కొంతకాలంగా ఇచ్ఛాపురం మండలం కేశుపురంలో తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. గత నెల 25న ఉదయం ఇచ్ఛాపురం వెళ్లిన సూర్యనారాయణ తిరిగి రాకపోవడంతో స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుమారుడు ఆదినారాయణ ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో లొద్దపుట్టి సమీపంలోని మామిడి చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకొని అనుమానాస్పదంగా మృతి చెందినట్లు రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకొని విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలియపరిచారు. మృతుడు సూర్యనారాయణగా కుటుంబ సభ్యులు గుర్తుపట్టారు. కుమారుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

క్లుప్తంగా

జనసేన నాయకుల బరితెగింపు



తొత్తడాంలో స్వాధీనం చేసుకున్న చీరలు

పూసపాటిరేగ : మండలం తొత్తడాం గ్రామంలో జనసేన నాయకులు బరి తెగించారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి ఇద్దరు జనసేన నాయకులు ఇంట్లో చీరలు వుంచడంతో సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం రాత్రి సీజ్ చేశారు. మండలంలోని తొత్తడాం గ్రామంలో ఎన్నికలలో ఓటర్లును ప్రలోభ పెట్టడానికి జనసేన నాయకులు ఇంట్లో దాచిన 156 చీరలను సీజ్ చేసినట్లు ఎస్ఐ ఎ.సన్యాసి నాయుడు తెలిపారు. గ్రామానికి చెందిన నందిక పైడిరాజు వద్ద 84 చీరలు, బొదిరెడ్ల జట్ల నాయుడు వద్ద 72 చీరలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికే చీరలు వుంచినట్లు గుర్తించి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి ఆస్పత్రిలో సీసీ కెమెరాలు

- డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ అప్పలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ అప్పలరాజు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు అన్నారు. శుక్రవారం స్థానిక సర్వజన ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యమిత్రలు సమయపాలన పాటించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొందుతున్న రోగులను ప్రతిరోజూ పరామర్శించి వైద్య సేవలపై ఆరా తీయాలన్నారు. సమావేశంలో టీమ్‌లీడర్లు తుంపల్లి జనార్దనరావు, భాను, దేవి, ఆర్.ముత్యాలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్చాలి..

విజయనగరం ఫోర్ట్: రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్చాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ఉన్న 108 అంబులెన్స్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ప్రతిరోజూ వాహనం కండీషన్ చెక్ చేసుకోవాలని సిబ్బందికి సూచించారు.

దోమల వ్యాప్తి నియంత్రణకు డ్రైడే కీలకం

- జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జగన్‌మోహనరావు



డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు

పార్వతీపురం టౌన్: దోమల వ్యాప్తి నియంత్రణకు డ్రైడే కీలకమని పార్వతీపురం మన్యం జిల్లా మలేరి యా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు అన్నా రు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని డీకేపట్నం, ఎన్.ములగ గ్రామాల్లో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. సిబ్బంది తో కలిసి ఇంటి పరిసరాల్లోని నీటి నిల్వలు పరిశీలించి దోమల లార్వా ఎక్కడైనా వృద్ధి చెందుతోందా? అని తనిఖీ చేశారు. అదేవిధంగా జ్వర లక్షణాలతో ఎవరైనా ఉన్నారా? అని ఆరా తీశారు. గ్రీన్ అంబా సిడర్స్ కాల్వలో చెత్త తీయడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరా ల్లో నీరు నిల్వ వల్ల దోమలు వృద్ధి చెంది మలేరి యా, డెంగీ తదితర జ్వరాలకు కారణమవుతాయ ని, కాల్వల్లో చెత్త వేయరాదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలని వీటిని లక్ష్యంగా చేసుకుని డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైడేను పాటించాలంటూ అక్కడి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష జరిపి డ్రైడే పటిష్ట నిర్వహణకు సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. డ్రైడే వివరాల ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, పంచా యతీ సెక్రటరీలు కె.తిరుపతిరావు, శ్రీలక్ష్మి, కార్యాలయం సిబ్బంది బి.ప్రసాదరావు, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణ, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మేజిస్ట్రేట్‌లు బాధ్యతల స్వీకరణ

సాక్షి ప్రతినిధి, విజయనగరం: జిల్లాలో ముగ్గురు మేజిస్ట్రేట్‌లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మొబైల్ మేజిస్ట్రేట్‌గా పి.బుజ్జి, ఎక్సైజ్ మేజిస్ట్రేట్‌గా ఎం.శ్రీనివాసరావు, చీపురుపల్లి మేజిస్ట్రేట్‌గా వై.ప్రేమలత ఆ కోర్టుల ఇన్‌చార్జిగా ఇంతవరకు వ్యవహరించిన మేజిస్ట్రేట్‌లు బి.రమ్య, రత్న కుమారిల నుంచి చార్జ్ తీసుకున్నారు. వీరు ముగ్గురు గుంటూరు, విశాఖపట్నం, గాజువాకలో పనిచేస్తూ బదిలీపై జిల్లాకు వచ్చారు.

నేతన్న నేస్తంతో చేనేతకు ఊపిరి

జిల్లాలో లబ్ధి పొందిన చేనేత కార్మికులు వివరాలు

సంవత్సరం	లబ్ధి పొందిన చేనేత కార్మికులు	జమ అయిన నగదు (రూ.కోట్లలో..)
2019-20	638	1.53
2020-21	765	1.83
2021-22	722	1.73
2022-23	716	1.72
2023-24	754	1.81





వేపాడ: వల్లంపూడిలో మగ్గం నేస్తున్న చేనేత కార్మికులు

- మగ్గాలకు పని కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- చేనేత కార్మికుల బతుకుల్లో వెలుగులు
- వలసల నుంచి కార్మికులు వెనక్కి...

వేపాడ: గత పాలకుల నిర్లక్ష్యంతో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన చేనేత రంగం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మళ్లీ ఊపిరిలూదింది. గతంలో చేనేతకు గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రభుత్వాల నుంచి కార్మికులకు తగిన ప్రోత్సాహం లభించకపోవడంతో కార్మికులు గత్యంతరం లేని పరిస్థితుల్లో తమ వృత్తిని వీడి వేరే వృత్తుల్లోకి వెళ్లి వలసబాట పట్టారు. తమ వృత్తిని వీడడం వారికి ఇష్టం లేకున్న తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సిన దుస్థితి. ఈ క్రమంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన జగనన్న ప్రభుత్వం ప్రజా సంకల్ప యాత్రలో చేనేత కార్మికుల కష్టాలను కళ్లారా చూశారు. చలించిపోయారు. స్వాతంత్య్ర పోరాటంలో తనదంటూ ఒక ముద్ర వేసిన చేనేత రంగంపై పాలకుల నిర్లక్ష్యాన్ని చూసి జగన్ ప్రభుత్వం ఆ రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. చేనేత కార్మికులకు భరోసా కల్పిస్తూ నేతన్న నేస్తం పథకం అమలు చేయడంతో చేనేత రంగానికి పూర్వ వైభవం వచ్చింది. వలసబాట పట్టిన కార్మికులు స్వగ్రామాలకు వచ్చారు. మూలకు చేరిన మగ్గాల దుమ్ము దులిపి పని చేపట్టారు.

నేతన్న నేస్తం పథకంతో జిల్లాలో 765 మంది చేనేత కార్మికులు లబ్ధి పొందారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పథకానికి 2019 - 20లోనే శ్రీకారం చుట్టారు. దీంతో ఐదేళ్లలో ఐదు పర్యాయాలు నేతన్న నేస్తం పథకం ద్వారా ప్రతీ లబ్ధిదారునికి 1,20,000 రూపాయిలు చొప్పున ఐదేళ్లలో 8.62 కోట్లు లబ్ధి పొందగలిగారు. ప్రతీ ఏటా నెలకు రెండు వేలు చొప్పున 12 నెలలకు 24 వేలు రూపాయిలు చొప్పున లబ్ధిదారునికి నేరుగా ఖాతాల్లో జమ చేశారు.

చేనేత కుటుంబాలకు భరోసా



చేనేత కుటుంబాలకు నేతన్న నేస్తం పథకం భరోసా కల్పించింది. చేనేతకు ప్రోత్సాహం లేక కార్మికులు చేసే పనికి గిట్టుబాటు లేకపోవటంతో మగ్గాలు వేయలేకపోయేవారం. దీంతో ప్రభుత్వం చేనేత కార్మికులకు నెలకు రెండు వేలు చొప్పున ఏడాదికి 24వేలు రూపాయిలు వేయడంతో కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయి.

– అల్లాడ అప్పారావు, చేనేత కార్మికుడు, వల్లంపూడి, వేపాడ

లబ్ధి పొందా..



నేతన్న నేస్తం పథకం వల్ల మూలకు చేరిన మగ్గాలను పైకితీసి పనులు చేస్తున్నాం. గత పాలకుల నిర్లక్ష్యంతో పనులు లేకపోవటంతో పెట్రోల్ బంకులో పని చేసి కుటుంబాన్ని పోషించుకునేవారం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నేతన్న నేస్తంతో మగ్గాం పని చేస్తున్నాను. ప్రతీ ఏటా అందిస్తున్న నేస్తం సొమ్ముతో నూలు కొనుకోవటంతో పాటు కుటుంబానికి భరోసా కలిగింది. చేనేత కార్మికులను ఆదుకున్న సీఎం వెంట నడుస్తాం.

– మాదన మల్లేసు, చేనేత కార్మికుడు, వల్లంపూడి, వేపాడ

ఊపిరి పోసిన నేతన్న నేస్తం



జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన నేతన్న నేస్తం పథకం చేనేత కార్మికుల కుటుంబాలకు ఊపిరి పోసింది. వల్లంపూడి బాపూజీ చేనేత సొసైటీ నుండి కార్మికులు మరింత ప్రోత్సాహం అందించి తయారుచేసిన చీరలు, పంచెలను కొనుగోలుకు ఏర్పాటు చేయటంతో చేనేత కార్మికులకు పూర్వ వైభవం కలిగింది.

– కవల సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు, బాపూజీ చేనేత సంఘం, వల్లంపూడి, వేపాడ

నూతన విద్యా విధానంతోనే యువతకు భవిష్యత్తు

- విశ్వవిద్యాలయంలో జాతీయ విద్యా విధానంపై సదస్సు



యూనివర్సిటీ అధ్యాపక బృందంతో ముఖ్యఅతిథి శంకరానంద

విజయనగరం అర్బన్: దేశ యువత బంగారు భవిష్యత్తు కోసం నూతన విద్యా విధానం అమలు కొనసాగాలని భారతీయ శిక్షణ్ మండల్ జాతీయ కార్యదర్శి బీఆర్ శంకరానంద అన్నారు. స్థానిక గిరిజన యూనివర్సిటీలో జాతీయ విద్యావిధానం-2020 పై శుక్రవారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యావిధానం విద్యార్థిలో ఆత్మస్థైర్యాన్ని ఇవ్వడం లేదని, లక్ష్యం సాధించక పోతే ఆత్మహత్యకు దారితీస్తుందని వ్యాఖ్యానించారు. ట్రైబల్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ అనిరుద్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో డీన్ ఆచార్య జితేంద్రమోహన్ మిశ్రా, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బోట్ల యజమానుల పేర్ల నమోదు

- మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి



చింతపల్లి తీరంలో వేట నిషేధ భృతి రెన్యూమరేషన్ చేస్తున్న డీడీ

పూసపాటిరేగ : జిల్లాలో మత్స్యకార భరోసా – వేట నిషేధ భృతి పథకానికి సంబంధించి ఈ నెల 2 నుంచి ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో ఉన్న బోట్లుకు సంబంధించిన పేర్లు నమోదు చేస్తున్నట్లు మత్స్యశాఖ డీడీ నిర్మలాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతపల్లి, తిప్పలవలస, పతివాడ బర్రిపేట, తమ్మయ్యపాలెం, ముక్కాం, చేపలుకంచేరు ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో రెన్యూమరేషన్ జరుగుతున్నట్టు పేర్కొన్నారు. ఆయా కేంద్రాల్లో ఉన్న బోట్లుకు సంబంధించి పేర్లు నమోదు చేయించుకోవడం, రిజిస్ట్రేషన్ పత్రం, బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, వాలిడ్ ఫిషింగ్ లైసెన్సు తదితర పత్రాలను పరిశీలించి వేట నిషేధ భృతికి ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఇప్పటికే పూసపాటిరేగ, భోగాపురం మండలాలులో 3 వేలకు పైబడి మత్స్యకారులు పేర్లు నమోదయ్యాయన్నారు. కొద్ది రోజులులో పూర్తి స్థాయిలో సభ్యుల అర్హతలును బట్టి గుర్తించడం జరుగుతోందన్నారు.

ప్రారంభమైన తైక్వాండో జాతీయ సెమినార్



జాతీయ సెమినార్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

విజయనగరం: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన నేషనల్ రెఫరీ సెమినార్‌కు మంచి స్పందన లభించింది. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. వేణుగోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు అంతర్జాతీయ క్లాస్-1 రిఫరీ తిరుమల్ జయపాల్ నేతృత్వంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి చివరి రోజు సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో న్యూ ఆంధ్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుతరెడ్డి, జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, కార్యదర్శి శ్రీహరి, వర్కింగ్ ప్రెసిడెంట్ అచ్చెంనాయుడు, ఉపాధ్యక్షుడు నయబ్ రసూల్, ప్రతినిధులు శ్రీనివాసులు, సాయిబాబా పాల్గొన్నారు.

నేత్రదానంతో పునర్జన్మ



సత్యవతి కార్నియాను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

రాజాం సిటీ: మండల పరిధి పెనుబాక గ్రామానికి చెందిన బండి సత్యవతి (73) గురువారం సాయంత్రం మృతి చెందింది. ఆమె మృతి చెందినప్పటికీ మరో ఇద్దరికి వెలుగులు నింపాలని కుటుంబ సభ్యులు నిశ్చయించుకున్నారు. దీంతో నేత్రదానం చేసేందుకు భర్త బండి కృష్ణ, కుమారులు జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, శ్రీనివాసరావు, కోటి ముందుకు వచ్చారు. ఈ విషయాన్ని స్థానిక రెడ్‌క్రాస్ సభ్యులకు తెలియజేయడంతో వారు శ్రీకాకుళం నేత్ర సేకరణ కేంద్రానికి సమాచారం అందించారు. రాత్రి 12 గంటల సమయంలో సత్యవతి నుంచి కార్నియాను సేకరించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయి, పెంకి చైతన్య, ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ నేత్రదానం కుటుంబ సాంప్రదాయం కావాలని అన్నారు. పెనుబాక గ్రామం నుంచి ఇప్పటి వరకు ముగ్గురు దానం చేశారని పేర్కొన్నారు.

జెడ్పీటీసీకి పలువురి పరామర్శ

రాజాం మండల జెడ్పీటీసీ బండి నర్సింహులుకు శుక్రవారం పలువురు పరామర్శించారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, మండల కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, పాలవలస శ్రీనివాసరావు, వి.చిన్నారావులు విషయం తెలుసుకుని గ్రామానికి చేరుకున్నారు. సత్యవతి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

దగాకోరు చంద్రబాబును నమ్మొద్దు..

- దగాకోరు చంద్రబాబును నమ్మొద్దు..
- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: ఎన్నికలు వచ్చేసరికి మాయ మాటలు చెప్పి దగాకోరు చంద్రబాబు పసుపు చొక్కాలు, కాషాయం చొక్కాలు, మరో రంగు చొక్కాతో ప్రజలను దగా చేసేందుకు ప్రజల ముందుకు వస్తున్నాడని, అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. మండలంలోని కెల్లపాలెం, ముల్లుపేట, కర్లాం, గవరపేట గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ఒక్క రూపాయి లంచం లేకుండా ఐదేళ్లుగా నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అమలుచేశారని గుర్తు చేశారు. ముక్కుపచ్చలారని వలంటీర్లను నక్సలైట్లు అని, టెర్రరిస్టులని, ఆడపిల్లలను ఎత్తుకు పోతారని చంద్రబాబునాయుడు దూషించాడన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలను తీసుకొచ్చి సంక్షేమ పథకాల అమలు కోసం లంచాలు దండుకొని పసుపు చొక్కాలు వేసుకున్న వారికే పథకాలు ఇచ్చారన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసిన, వేయకపోయినా అర్హతా ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు గుర్తు చేశారు. వలంటీరు వ్యవస్థ అందజేసిన పథకాల్లో లబ్ధిదారులు ఒక్క రూపాయి లంచం ఇచ్చాం అని చెబితే వేదిక దిగి వెళ్ళి పోతామని స్పష్టం చేశారు. పేద పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే విధంగా ఎదగాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం విద్యా వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేస్తానని చెప్పి చంద్రబాబు మోసం చేస్తే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో రుణమాఫీ చేసారన్నారు. పేదలకు మేలు జరుగుతుంటే చూసి ఓర్వలేని చంద్రబాబునాయుడు వలంటీర్ వ్యవస్థపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు అన్యాయం చేశారన్నారు. చంద్రబాబు చేసిన ఫిర్యాదు కారణంగా గతనెలలో రాష్ట్ర వ్యాప్తంగా 33 మంది లబ్ధిదారులు పింఛన్లు కోసం ఎండలో రోడ్డు ఎక్కి మృతి చెందారన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఎంపీ అభ్యర్థిగా బెల్లాన చంద్రశేఖర్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో-ఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, గ్రామ సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ బాణాన రత్నం, గ్రామ నాయకులు బాణాన శ్రీనివాసరావు, బాణాన రమణ, బెల్లాన త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన ప్రజలు

జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ



భోగాపురం ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

భోగాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని జిల్లా పరిషత్ చైర్మన్, ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని రామచంద్రపేట, కొండ్రాజుపాలెం, భోగాపురం గ్రామాల్లో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులు తీన్‌మార్ డప్పులు మోతలతో సాదర స్వాగతం పలికారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎంపీ బెల్లాన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో వారు మాట్లాడారు. చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ అని అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలో కూడా ఇదే మాదిరిగా 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఒకటి కూడా అమలు చేయలేదని గుర్తు చేశారు. గతంలో చంద్రబాబు పాలన, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రతి ఒక్కరూ గమనించి అభివృద్ధి, సంక్షేమం అందించే నాయకుడికి పట్టం కట్టాలని కోరారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, మరో రెండు సంవత్సరాల్లో పూర్తి కాబోతుందని, తద్వారా ఈ ప్రాంతంలోని చాలామంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి లభిస్తాయని తెలిపారు. ప్రస్తుత ఎన్డీఏ తనషేప పోటీ చేస్తున్న ఉమ్మడి అభ్యర్థికి ఈ ప్రాంతం పట్ల ఎటువంటి అవగాహన లేదని, కేవలం వేల కోట్ల సంపాదనతో ఇక్కడకు వచ్చి ఎన్నికల సమయంలో హడావిడి చేస్తారని, తిరిగి ఎన్నికల్లో ఓడిపోయిన వెంటనే అమెరికా వెళ్లిపోతారని ఏద్దేవా చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి బడ్డుకొండ అప్పలనాయుడిని ఎమ్మెల్యేగా, బెల్లాన చంద్రశేఖర్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పడాల బానుప్రకాశ్, దంతులూరి రావాడబాబు, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, బడ్డుకొండ మణిదీప్‌నాయుడు, ప్రదీప్‌నాయుడు, ఉప్పాడ శివారెడ్డి, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎర్రప్పలనారాయణ, రమేష్‌రాజు, సూరాడ చిన్నారావు, దుక్క అప్పన్న, శ్రీను, సుగ్గి రాము, కొమ్మూరు సుబోషణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ నేషనల్ ట్రెక్కింగ్ శిబిరానికి జీఎంఆర్ ఐటీ విద్యార్థిని

రాజాం సిటీ: కేరళలోని ఉదగమండలమ్‌లో ఈ నెల 6 నుంచి 13 వరకు జరగనున్న ఎన్‌సీసీ నేషనల్ ట్రెక్కింగ్ క్యాంపునకు స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థిని ఎం.నందినీవర్మ 14 ఆంధ్రా బెటాలియన్ తరపున ఎంపికైందని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ ఎంపికలు ఇటీవల శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో జరిగాయన్నారు. ఆమెను ప్రిన్సిపాల్‌తో పాటు ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, స్టూడెంట్స్ డీన్ డాక్టర్ వి.రాంబాబు, విద్యార్థులు అభినందించారు.

రేపు అండర్-23 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న (ఆదివారం) అండర్- 23 విభాగంలో పురుషుల జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.ఎల్.ఎన్.రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2001 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వారి ఒరిజనల్ ఆధార్, జన్మదిన ధ్రువపత్రాలతో పాటు స్టడీ సర్టిఫికెట్, ఆఖరి మూడేళ్ల మార్కుల జాబితాలతో పోటీకు హాజరుకావాలని కోరారు. ఉదయం 6.30 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని, క్రీడాకారులు వైట్ డ్రెస్, సొంత క్రికెట్ కిట్‌తో హాజరు కావాలని కోరారు.

5,6,7 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కును ఈ నెల 5, 6, 7 తేదీల్లో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి శుక్రవారం ఒక ప్రటనలో తెలిపారు. దీని కోసం అన్ని నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు.

ఆ మూడు రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఓటు వేయవచ్చన్నారు. ఓటు హక్కును వినియోగించుకోడానికి విజయనగరంలోని జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీలో ప్రత్యేక ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అకడమిక్ బ్లాక్-1 గ్రౌండ్ ఫ్లోర్‌లోని 1, 2, 3, 4, 5 గదుల్లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా కేంద్రం విజయనగరం నియోజకవర్గంలో ఓటు కల్గిన ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవడానికి కూడా జేఎన్‌టీయూ లోని అకడమిక్ బ్లాక్-2లో ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. పోస్టల్ ఓటు విషయంలో ఏమైనా సందేహాలు ఉన్నవారు, కలెక్టరేట్‌లోని హెల్ప్ డెస్కను సంప్రదించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: పోలింగ్ కేంద్రాలను ఈ నెల 11వ తేదీ నాటికి అన్ని వసతులతో సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. తాగునీరు, విద్యుత్, ర్యాంపులు, మరుగుదొడ్లు, నేమ్ బోర్డులతో సిద్ధంగా ఉంచాలని చెప్పారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర ఎన్నికల అధికారులతో శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 12వ తేదీన ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి చక్కని ఆహారం, పానీయాలను అందించాలని ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కె.కార్తీక్, డీఆర్వో ఎస్.డి.అనిత, నోడల్ అధికారులు పాల్గొన్నారు.